సాక్షి సంగారెడ్డి
గురువారం । 30 । మార్చి । 2023



త్వరలో గృహలక్ష్మి పథకం
మహిళలకు ఉపయోగపడేలా త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మి పథకానికి శ్రీకారం చుడుతుందని పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. 11లో



ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం
ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. సికింద్రాబాద్‌కు సూపర్ డీలక్స్ బస్సు సర్వీసును ప్రారంభించారు. 11లో

ఇద్దరికి పాజిటివ్
పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం 19 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా అందులో ఇద్దరికి పాజిటివ్ వచ్చినట్లు టెస్టుల నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు 14 మందికి నిర్వహించినట్లు పేర్కొన్నారు.



రథోత్సవానికి వేళాయె

రేపటి రథోత్సవానికి చకచకా ఏర్పాట్లు ★ ముస్తాబవుతున్న జోగిపేట జోగినాథ ఆలయం ★ రాష్ట్రంలోనే అతిపెద్ద లోహ రథం



శ్రీ జోగినాథ లోహ రథం

అందోల్(జోగిపేట): తెలంగాణలోనే అతిపెద్ద లోహ రథంగా జోగిపేట జోగినాథ ఆలయ రథానికి పేరుంది. 50 ఫీట్ల ఎత్తుతో లోహ రథం ప్రతి ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఈనెల 31వ తేదీన ఘనంగా రథోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రథాన్ని రంగు రంగులతో తీర్చిదిద్దారు. రథంపై శిఖరాలను ఏర్పాటు చేశారు. ఐదు అంతస్తులతో కూడిన ఈ రథంపై ప్రతి అంతస్తులో దేవతా మూర్తులైన నందీశ్వరుడు, గణపతి, దుర్గామాత, శివలింగం, ఇద్దరి దివ్య సుందరీమణుల పంచలోహ విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఈ విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. రాత్రి 10 గంటలకు ప్రారంభమయ్యే రథం ఊరేగింపు తెల్లవారుజాము వరకు కొనసాగనుంది. జోగిపేట, సంగారెడ్డి ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కానున్నారు.

ఉత్సవ కార్యక్రమాలు

- 31వ తేదీ శుక్రవారం రాత్రి 10 గంటలకు స్వామివారి రథోత్సవం
- ఏప్రిల్ 1న శనివారం ఎడ్లబండ్ల ఊరేగింపు
- ఏప్రిల్ 2న ఆదివారం అగ్నిగుండాలు
- ఏప్రిల్ 3న సోమవారం శివపార్వతుల కల్యాణం
- ఏప్రిల్ 4న మంగళవారం రాత్రి 12 గంటలకు లంకాదహనం
- ఏప్రిల్ 5న అమ్మవారికి కుంకుమార్చన



17 ఏళ్లుగా జాతరను వైభవంగా నిర్వహిస్తున్నాం



జోగిపేట జోగినాథ జాతర ఉత్సవాలను 17 సంవత్సరాల నుంచి అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. గతంలో కొన్నేళ్ల పాటు కర్రలతో చేసిన రథంతో జాతర జరిగేది. దీంతో గాలి వానలతో చాలా సార్లు ఇబ్బందులు ఏర్పడ్డాయి. తర్వాత వివిధ కారణాలతో చాలా ఏళ్లుగా జాతరను నిర్వహించలేదు. పట్టణ వర్తక, వ్యాపార, కార్మిక, కర్షక, భక్త బృందాలు, పట్టణ ప్రజల సహకారంతో జాతర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఎనిమిది రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటారు.

– మదుపతి భద్రప్పస్వామి, ఆలయ పూజారి, జోగిపేట

జిల్లాలోనే జోగిపేట జోడు లింగాల శ్రీ జోగినాథ ఆలయం ప్రసిద్ధి. ప్రతి ఏడాది మార్చి, ఏప్రిల్ మాసాల్లో వారం రోజుల పాటు ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉత్సవాల కోసం ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రధాన కూడళ్లలో దేవుళ్ల ప్రభలను ఏర్పాటు చేయడంతో జాతర కళ ఉట్టిపడుతోంది. ఏప్రిల్ 5వ తేదీ వరకు జోగినాథ ఉత్సవాలు నిర్వహించేందుకు రథోత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల కోసం ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఉత్సవాలను రాజకీయాలకు అతీతంగా ఘనంగా నిర్వహించేందుకుగాను 21 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు.

ఉత్సవాలకు రూ.20 లక్షలు

- జోగినాథ రథోత్సవాలకు ప్రభుత్వం తరపున రూ.20 లక్షలను ఎమ్మెల్యే క్రాంతికిరణ్ మంజూరు చేయించారు. గతేడాది కంటే ఘనంగా ఉత్సవాలను నిర్వహించేందుకు ఈ నిధులు ఉపయోగపడతాయని రథోత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. గత సంవత్సరం ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేయగా అవి కేవలం విద్యుత్ లైట్లు, సీసీ కెమెరాలకు మాత్రమే వినియోగించినట్లుగా చెబుతున్నారు. ఈ ఏడాది పెద్ద ఎత్తున కార్యక్రమాలను నిర్వహించనున్నారు.
- జోగిపేట జోగినాథ ఉత్సవాల్లో భాగంగా నేటి నుంచి జరిగే స్వామివారి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే రథోత్సవానికి అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్, మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహ, పి.బాబూమోహన్‌తో పాటు పలువురు హాజరు కానున్నట్లు రథోత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ఈ ఏడాది కమిటీ సభ్యులు ఎమ్మెల్యే, మాజీ మంత్రుల వద్దకు వెళ్లి ఆహ్వానపత్రికలను అందజేశారు.

4న జోగిపేటకు యూట్యూబర్ రాజు రాక

జోగినాథ రథోత్సవాలలో భాగంగా ఈనెల 4వ తేదీన నిర్వహించే లంకా దహనం కార్యక్రమానికి ప్రముఖ యూట్యూబర్ 'పుంజు'(రాజు)ను రథోత్సవ కమిటీ సభ్యుడు పి.శివశేఖర్ ఆహ్వానించారు. జోగిపేటలో పోలీస్ అధికారిగా పనిచేసిన కృష్ణమూర్తి(ఏసీపీ) కుమారుడైన రాజును ఉత్సవాలకు ఆహ్వానించడం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. యూట్యూబర్‌గా వేలాది మంది మనసులు దోచుకున్న రాజు మంగళవారం రానున్నట్లు ఇదివరకే ప్రకటించారు.

రాముడి జీవితం తరతరాలకు ఆదర్శం

కలెక్టర్ డాక్టర్ శరత్



సంగారెడ్డి టౌన్: శ్రీరాముడి జీవితం తరతరాలకు ఆదర్శమని కలెక్టర్ డాక్టర్ శరత్ అన్నారు. గురువారం శ్రీరామనవమిని పురస్కరించుకొని జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు భక్తి శ్రద్ధలతో వేడుకలు జరుపుకోవాలని కోరారు. సీతారాముల కల్యాణం కమనీయ ఘట్టమని, సీతారాముల అనుగ్రహంతో అందరూ బాగుండాలని, అందరికీ శుభాలు కలగాలని ఆకాంక్షించారు.
29 ఎస్ ఎన్ జి 38

పండుఈగ నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

జహీరాబాద్: కూరగాయలు, పండ్ల తోటల్లో పండు ఈగ నివారణపై ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సరిత రైతులకు అవగాహన కల్పించారు. బుధవారం మండలంలోని రంజోల్ గ్రామంలో సాగులో ఉన్న జామ, మామిడి, టమాట, సోయాబీన్ పంటలను పరిశీలించారు. ఆయా పంటల్లో పండు ఈగ సోయే అవకాశం ఉన్నందున దీని నివారణకు లింగాకర్షక బుట్టలు, ట్రాప్స్ అమర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త సరిత, ఏఈఓ ప్రదీప్‌కుమార్, రైతులు సంగారెడ్డి, మల్లికార్జున్, మల్లారెడ్డి, ఫిరోజ్, మానెప్ప, రాజు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారు



బహుమతులు అందజేస్తున్న సుధారాణి

పటాన్‌చెరు: ప్రస్తుత కాలంలో మహిళలు రాజకీయం, విద్య, ఉద్యోగాలతో పాటు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాట సుధారాణి అన్నారు. బుధవారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో సర్పంచ్ గడ్డం బాలమణి, ఎంపీటీసీ గడ్డం శ్రీశైలం ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి జెడ్పీటీసీ సుప్రజ, ఎంపీపీ సుష్మశ్రీలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేసి సన్మానించారు. అనంతరం జెడ్పీటీసీ సుప్రజ, ఎంపీపీ సుష్మశ్రీ మాట్లాడుతూ.. మహిళలు వంటగదికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో రాణించాలని, ప్రపంచంలో మహిళల కన్నా మరో గొప్ప శక్తి లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శోభ, ఎంపీటీసీ అంజిరెడ్డి, వార్డు సభ్యులు భారతి, వనిత, సోని, లావణ్య, నారాయణ, మహిళలు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సాల్మన్



నూతనంగా ఎన్నికైన సభ్యులతో సాల్మన్

జహీరాబాద్: జహీరాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సాల్మన్ ఎన్నికయ్యారు. బుధవారం కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన ఎన్నికల్లో మెజార్టీ న్యాయవాదులు సాలమన్‌కు మద్దతు పలికారు. ఉపాధ్యక్షుడిగా పి.మాణెప్ప, ప్రధాన కార్యదర్శిగా సంతోష్‌కుమార్ సాగర్, సహాయ కార్యదర్శిగా మహదేవ్, కోశాధికారిగా బి.గోపాల్ ముదిరాజ్‌లు ఎన్నికయ్యారు. సభ్యులుగా సోమశేఖర్ పాటిల్, ఎ.సందీప్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా ఇప్పపల్లి గోపాల్, ఏజెంట్లుగా రుద్రయ్యస్వామి, కాశీనాథ్‌రెడ్డిలు వ్యవహరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు సాలమన్ తోటి న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు.

రేపు తైబజార్ వేలం

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ తైబజార్ వేలంపాటను ఈ నెల 31న శుక్రవారం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డి తెలిపారు. బుధవారం తైబజార్ వేలం ఉండగా వ్యాపారులు హాజరుకానందున వాయిదా వేశామని పేర్కొన్నారు. తిరిగి శుక్రవారం వేలం పాట నిర్వహిస్తామని వెల్లడించారు. వేలం పాటలో పాల్గొనే వ్యాపారులు ఉదయం 11.30 గంటలకు మున్సిపల్ సమావేశ మందిరంలో హాజరుకావాలని కోరారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు



కొండాపూర్(సంగారెడ్డి): ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారంతో ముగిశాయి. ఇంటర్మీడియట్ పరీక్షల్లో భాగంగా చివరి రోజు బుధవారం ద్వితీయ సంవత్సరం సీఈసీ విద్యార్థులకు కామర్స్ పరీక్ష జరగగా, ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు రసాయన శాస్త్రం పరీక్ష జరిగింది. ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 15,119 మంది విద్యార్థులకు గాను 14,585 మంది హాజరు కాగా 534 మంది గైర్హాజరయ్యారు. డీఐఈఓ నాలుగు, డీఈసీ ఐదు, హెచ్‌పీసీ ఐదు, ఫ్లయింగ్ స్క్వాడ్లు ఎనిమిది, సిట్టింగ్ స్క్వాడ్లు నాలుగు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ పరీక్షలకు 96.47 హాజరు శాతం నమోదైనట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవిందరాం తెలిపారు.

గ్రామ అభివృద్ధికి సహకరించాలి

పటాన్‌చెరు టౌన్: మైనింగ్ నిర్వాహకులు నిబంధనలు పాటిస్తూ గ్రామాభివృద్ధికి సహకరించడంతో పాటు హెల్త్ క్యాంపులు నిర్వహించాలని లక్డారం గ్రామస్తులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. పటాన్‌చెరు మండలం లక్డారం గ్రామంలో సర్వే నంబర్ 747లో టీఎస్ఏ స్టోన్ ఇండస్ట్రీస్ 10.12 హెక్టార్ల విస్తీర్ణంలో రఫ్ స్టోన్, మెటల్ మైనింగ్ కోసం కాలుష్య నియంత్రణ మండలి నిర్వహించిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణలో లక్డారం గ్రామస్తులతో పాటు ఎన్‌జీఓలు పాల్గొన్నారు. ఎన్‌జీఓలతో పాటు చాలా వరకు గ్రామస్తులు మైనింగ్ ఏర్పాటును స్వాగతిస్తూ గ్రామాభివృద్ధికి సహకరించి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని తమ అభిప్రాయాలను అధికారులకు తెలిపారు. మైనింగ్ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణను అదనపు కలెక్టర్ వీరారెడ్డి, పీసీబీ ఈఈ గీత, పటాన్‌చెరు తహసీల్దార్ పరమేశం, పోలీసు బందోబస్తు మధ్య చేపట్టారు. గ్రామస్తులు దుమ్ము, ధూళి రాకుండా మైనింగ్ నిర్వాహకులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ వీరారెడ్డి మాట్లాడుతూ.. మైనింగ్ ఏర్పాటుపై నిర్వహించిన ప్రజాభిప్రాయల నివేదికను ప్రభుత్వానికి అందజేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ నాగేశ్, పటాన్‌చెరు సీఐ వేణుగోపాల్ రెడ్డి, అమీన్‌పూర్ సీఐ శ్రీనివాసులు రెడ్డి, పటాన్‌చెరు ఎస్ఐ ప్రసాద్ రావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

ఎట్టకేలకు రిజిస్ట్రేషన్ కార్యాలయం

ఇక పటాన్‌చెరులోనే అన్ని లావాదేవీలు

పటాన్‌చెరు: పటాన్‌చెరు నియోజకవర్గంగా ఏర్పడిన నాటి నుంచి రిజిస్ట్రేషన్ కార్యాలయం వస్తుందని ఆశించిన స్థానికుల దశాబ్దాల కల ఎట్టకేలకు నెరవేరింది. సంగారెడ్డి సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయ పరిధి నుంచి వచ్చే నెల ఒకటో తేదీన పటాన్‌చెరులో సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయం ఏర్పాటు కానుంది. పట్టణంలోని పాత తహసీల్దార్ కార్యాలయంలో కార్యాలయం ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లతో కూడిన కార్యాలయం, సిబ్బందితో ప్రాథమికంగా పాత తహసీల్దార్ భవంతి(గ్యాస్ గోదాం వెనుక)లో కొత్త సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేయనున్నారు. ప్లాట్లు, అపార్ట్‌మెంట్లు ఇతర ఆస్తులు రిజిస్ట్రేషన్‌తో పాటు పెళ్లిళ్లు, సంస్థల రిజిస్ట్రేషన్లకు ఇక నుంచి సంగారెడ్డి కార్యాలయం వెళ్లాల్సిన పని తప్పింది. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి చేసిన కృషితో సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ఇదిలా ఉండగా సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం ఏర్పాటుకు విడుదలైన ప్రభుత్వ ఉత్తర్వులు(జీఓ)లో కొన్ని లోపాలు ఉన్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఉమ్మడి జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పటాన్‌చెరుకు తరలిరానుందని ఆ జీఓలో వెలువరించారు. అయితే దానిపై స్పష్టత కొరవడిందని అధికార వర్గాలు పేర్కొన్నారు. ఆ జీఓ సవరణ ప్రక్రియ కొనసాగుతుందని, మొత్తానికి పటాన్‌చెరులో వచ్చే నెల ఒకటి నుంచి రిజిస్ట్రేషన్ లావాదేవీలు ప్రారంభం కానున్నాయని చెబుతున్నారు. కార్యాలయ ప్రారంభోత్సవానికి కసరత్తు చేస్తున్నారు.

చాత్తాద శ్రీవైష్ణవ సంఘం కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

నల్లకుంట: తెలంగాణ చాత్తాద శ్రీవైష్ణవ సంఘం అధ్యక్షుడు అశ్వాపురం వేణుమాధవ్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం బాధ్యతలు చేపట్టింది. జిల్లాల వారీగా కొత్త కమిటీలు కొలువుదీరాయి. సంగారెడ్డి జిల్లా చాత్తాద శ్రీవైష్ణవ సంఘం అధ్యక్షుడిగా టి.కొండస్వామి, వైస్ – ప్రెసిడెంట్ డి.మురళి, తోమాల వాణి, ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసస్వామి, సంయుక్త కార్యదర్శి టి.మురళి, సంప్రదాయ విభాగం సహాయ కార్యదర్శి ఎం.భాస్కరస్వామి, కోశాధికారిగా శ్రీధర్ ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమం హైదరాబాద్ నల్లకుంటలోని చాత్తాద వైష్ణవ సంఘం ప్రధాన కార్యాలయంలో జరిగింది. తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కూర్మాచలం అనిల్‌కుమార్ హాజరయ్యారు. సంఘం ఎన్నికల అధికారులుగా కొండా వేణుమూర్తి, గజవల్లి సత్యనారాయణ, ధర్మపురి శ్రీనివాస్, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరమణ వ్యవహరించారు. చాత్తాద శ్రీవైష్ణవ సంఘం ఆత్మగౌరవ భవన నిర్మాణం త్వరలోనే సాకారమవుతుందన్నారు అశ్వాపురం వేణుమాధవ్ తెలంగాణ ప్రభుత్వ చేయూతకు సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు. చాత్తాద శ్రీవైష్ణవ సంఘం అధ్యక్షుడు టి.కొండస్వామి మాట్లాడుతూ భగవద్‌రామానుజుల స్ఫూర్తితో సమసమాజ నిర్మాణంలో చాత్తాద శ్రీవైష్ణవ సంఘం క్రియాశీలక పాత్ర పోషిస్తుందన్నారు.

రూ.88.30 కోట్లతో బల్దియా బడ్జెట్

సంగారెడ్డి మున్సిపాలిటీ: 2023 – 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సంగారెడ్డి మున్సిపల్ బడ్జెట్ రూ.88.30 కోట్లకు సభ్యులు ఆమోదం తెలిపారు. మున్సిపల్ చైర్ పర్సన్ విజయలక్ష్మి అధ్యక్షతన బుధవారం సంగారెడ్డి మున్సిపల్ బడ్జెట్ సమావేశం జరిగింది. బడ్జెట్ ఎక్కువ కేటాయిస్తూ నిధులు దుర్వినియోగం చేస్తున్నారని పలువురు కౌన్సిలర్లు ఆరోపించారు. అలాగే సంగారెడ్డి పట్టణంలో ఫ్లెక్సీలను విచ్చలవిడిగా ఏర్పాటు చేస్తున్నా వాటిపై పన్నులు వసూలు చేయడం లేదని కొందరు సభ్యులు కమిషనర్‌ను నిలదీశారు. ఇటీవల జరిగిన కార్మికుల తప్పుడు వేతనాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని కమిషనర్‌ను వివరణ కోరారు. త్వరలోనే హాజరు పట్టికను పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ చంద్రశేఖర్ వివరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ లత, కౌన్సిలర్లు మందుల నాగరాజు, విష్ణువర్ధన్, రాజేందర్ రెడ్డి, శ్రీకాంత్, మంజులత, ఉమామహేశ్వరి, శ్రవంతి, కూన వనిత తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న చైర్‌పర్సన్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం



స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయిస్తున్న మున్సిపల్ కమిషనర్, మహిళలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం తెల్లాపూర్‌లో స్వచ్ఛత ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వచ్ఛత ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మన ఇంటిని ఏవిధంగా శుభ్రంగా ఉంచుకుంటామో అదేవిధంగా పరిసరాలను శుభ్రంగా ఉచ్చుకోవాలని కోరారు. మనం ఉండే పరిసరాలు శుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. ఈ సందర్భంగా స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేశారు .తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో సింగిల్ యూస్ ప్లాస్టిక్ కవర్లను నిషేధించామని, వ్యాపారస్తులు, ప్రజలు ప్లాస్టిక్ కవర్లను వాడొద్దని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని కాలనీల్లో తడి, పొడి చెత్తను వేరు చేయడంపై అవగాహన కల్పించారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం పదిలం

సంగారెడ్డి టౌన్: చిరు ధాన్యాల ఆహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జిల్లా శిశు సంక్షేమ అధికారి పద్మావతి అన్నారు. బుధవారం సంగారెడ్డిలోని బాలికల పాఠశాలలో పిల్లలకు చిరుధాన్యాల మీద వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలకు చిరుధాన్యాల ప్రాముఖ్యత, పోషకాలు, వ్యక్తిగత పరిశుభ్రత, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. అనంతరం పిల్లల చేత పోషణ ప్రతిజ్ఞ చేయించి వారికి పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన బాలికలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోషణ అభియాన్ కోఆర్డినేటర్ సౌమ్య, అసిస్టెంట్ కోఆర్డినేటర్ నవీన్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న పద్మావతి, తదితరులు

'పది' పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

అదనపు కలెక్టర్ వీరారెడ్డి

సంగారెడ్డి టౌన్: పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. పదో తరగతి పరీక్షల నిర్వహణపై బుధవారం హైదరాబాద్ నుంచి విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి, విద్యాశాఖ ఉన్నత అధికారులతో కలిసి జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతి పరీక్షల నిర్వహణపై జిల్లాలో చేపట్టిన చర్యల గురించి వీరారెడ్డి మంత్రికి వివరించారు. ఏప్రిల్ 3 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని, అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లాలో 118 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, 21,413 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు వివరించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, తగిన పోలీసు బందోబస్తుకు ఆదేశించామన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలోనూ ఏఎన్ఎం, ఆశ వర్కర్ ఉండేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పరీక్ష సమయాలకు అనుగుణంగా అన్ని రూట్లలో విద్యార్థుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడిపేలా ఆర్టీసీ అధికారులకు సూచనలు చేశామని చెప్పారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం, విద్యుత్ సరఫరాకు ఆటంకం తలెత్తకుండా ట్రాన్స్‌కో అధికారులు చర్యలు చేపట్టారని తెలిపారు. మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా ఇన్విజిలేటర్లతో పాటు ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలని సూచించారు. ఈ కాన్ఫరెన్స్‌లో అదనపు ఎస్పీ వాణి విశ్వనాథ్, ట్రాన్స్‌కో ఎస్ఈ మాధవరెడ్డి, ఇన్‌చార్జి జిల్లా విద్యాధికారి విజయ, అసిస్టెంట్ ఎగ్జామినేషన్స్ అధికారి మణిదీపిక ఉన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జిల్లా అధికారులు

క్లుప్తంగా

చెరువులో మునిగి యువకుడి మృతి


శ్రీకాంత్ (ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): చేపల వేటకు వెళ్లిన యువకుడు చెరువులో మునిగి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని రంగాయపల్లిలో మంగళవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రంగాయపల్లి గ్రామానికి చెందిన దానప్ప శ్రీకాంత్(30) మంగళవారం సాయంత్రం చేపలు పట్టడానికి స్థానిక చెరువుకు వెళ్లాడు. ఎంతకు తిరిగి రాక పోవడంతో స్థానికులు చెరువులో గాలించగా మృతదేహం లభ్యమైంది. మృతుడికి భార్య రోజా, కూతురు, కుమారుడు ఉన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో రెండు ఇళ్లు దగ్ధం


కాలిపోయిన పూరిళ్లు

పాపన్నపేట(మెదక్): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని బాచారం గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన చొప్పరి పెంటమ్మ, చొప్పరి కిష్టమ్మ పూరిగుడిసెల్లో నివాసం ఉంటున్నారు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. వారు పనులకు వెళ్లిన సమయంలో బుధవారం సాయంత్రం షార్ట్ సర్క్యూట్‌తో మొదట పెంటమ్మ ఇంట్లో మంటలు రేగడంతో అవి కిష్టమ్మ ఇంటికి, ఆ తర్వాత స్వప్న ఇంటికి మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. కిష్టమ్మ గుడిసెలో ఉన్న రూ.3 లక్షలు, పెంటమ్మ గుడిసెలో ఉన్న రూ.3 లక్షలు, స్వప్న ఇంటిలో రూ.లక్ష నష్టం సంభవించినట్లు బాధితులు తెలిపారు. స్థానిక ఇన్‌చార్జి తహసీల్దార్ మధు కాలిపోయిన ఇళ్లను పరిశీలించారు.

మహిళ ఆత్మహత్య


శోభ మృతదేహం

సిద్దిపేటకమాన్: ఆర్థిక ఇబ్బందులకు తోడు కుమారుడికి పెళ్లి కావడం లేదని మనస్తాపానికి గురై మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన సిద్దిపేట వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. వన్‌టౌన్ ఎస్‌ఐ మల్లేశం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బీడీ వర్కర్‌గా పనిచేస్తున్న రచ్చ శోభ (50) పట్టణంలోని నాసర్‌పూరలో తన కుమారుడితో కలిసి నివసిస్తోంది. భర్త 30 ఏళ్ల క్రితం వదిలేసి వెళ్లడంతో మతిస్థిమితం సరిగా లేక అప్పుడప్పుడు రాత్రి సమయంలో తలుపులు తెరిచి ఒంటరిగా వెళ్లి వచ్చేంది. తమ పేదరికాన్ని చూసి కుమారుడికి పెళ్లి సంబంధం కుదరడం లేదని బాధపడుతూ మనస్తాపానికి గురై జీవితంపై విరక్తి చెంది బుధవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన శోభ పట్టణ శివారులోని ఎర్ర చెరువులో శవమై తేలింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఏడుగురికి జరిమానా

సిద్దిపేటకమాన్: పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించగా ఏడుగురు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని బుధవారం కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి రూ.14,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు గ్రామాలు కృషి

- ఇబ్రహీంపూర్, బంజేరుపల్లికి రాష్ట్ర స్థాయి పురస్కారం
- సోలార్ విద్యుత్, హరితహారం విభాగంలో ఎంపిక
- ఈనెల 31న హైదరాబాద్‌లో అవార్డుల ప్రదానం
- అభినందించిన ప్రజాప్రతినిధులు, అధికారులు

సిద్దిపేటరూరల్: పర్యావరణ పరిరక్షణకు గ్రామస్తులు కృషిచేస్తున్నారు. వీరి కృషిని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. పర్యావరణ పరిరక్షణకు కృషిచేస్తున్న నారాయణరావుపేట మండల పరిధిలోని బంజేరుపల్లి, ఇబ్రహీంపూర్ గ్రామాలు మరోసారి రాష్ట్ర స్థాయి పురస్కారాలు సొంతం చేసుకున్నాయి. ఈమేరకు రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ బుధవారం ఇబ్రహీంపూర్ గ్రామానికి కార్బన్ న్యూట్రల్ విశేష్ పంచాయత్ పురస్కార్ అవార్డు పురస్కారానికి ఎంపిక చేయగా, బంజేరుపల్లి గ్రామానికి గ్రామ్ ఊర్జా స్వరాజ్ విశేష్ అవార్డుతో పురస్కారాలతో సత్కరించనుంది.


ఇబ్రహీంపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం


బంజేరుపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

హరితహారం, కాలుష్య నివారణతో అవార్డు కైవసం

ఇబ్రహీంపూర్ గ్రామంలో సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, నాయకులు, అధికారుల భాగస్వామ్యం, మంత్రి హరీశ్‌రావు దిశానిర్దేశంతో అవార్డును సొంతం చేసుకున్నారు. ప్రభుత్వం చేపట్టిన హరితహారం కార్యక్రమంలో సుమారు మూడు లక్షల మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణలో గ్రామస్తులు పాలుపంచుకున్నారు. గ్రామంలో చెత్తా చెదారం లేకుండా పరావరణాన్ని కాపాడుకుంటూ కాలుష్యాన్ని నివారించడంతో గ్రామస్తులు ప్రత్యేక చొరవ చూపారు.

సోలార్ వినియోగంలో బంజేరుపల్లికి అవార్డు

నూతనంగా ఏర్పాటైన బంజేరుపల్లి గ్రామం గతం నుండే ఆదర్శ గ్రామంగా కొనసాగుతుంది. ఈ క్రమంలో గ్రామం అంతటా అర్ధరాత్రి సూర్యుడు ఉన్నట్లుగా సోలార్ విద్యుత్‌ను వినియోగించడం జరుగుతుంది. ఇంటింటికి, వీధిలైట్లకు సోలార్ ద్వారా విద్యుత్ ను వినియోగించడం ద్వార గ్రామాన్ని రాష్ట్ర ప్రభుత్వం గ్రామ్ ఊర్జా స్వరాజ్ విశేష్ పంచాయత్ పురస్కార్ అవార్డుతో సత్కరించింది.

చాలా సంతోషంగా ఉంది



గ్రామానికి సోలార్ విభాగంలో రాష్ట్ర స్థాయి అవార్డు రావడం సంతోషంగా ఉంది. మంత్రి చొరవతోనే సోలార్ పరికరాలను గ్రామంలో ఏర్పాటు చేసుకున్నాం. అప్పటి నుంచి సోలార్ విద్యుత్‌నే వినియోగిస్తున్నాం. మంత్రి హరీశ్‌రావు దిశానిర్దేశం చేశారు. గ్రామస్తులు, నాయకులు సహకరించారు. అవార్డు రావడానికి కృషి చేసిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు.

– శంకర్, సర్పంచ్, బంజేరుపల్లి

అవార్డుతో మరింత గుర్తింపు



ఇబ్రహీంపూర్ గ్రామానికి అవార్డు రావడం చాలా సంతోషంగా ఉంది. గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృది చేసుకుంటూ, ప్రభుత్వం చేపట్టిన హరితహరం కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నాం. కాలుష్యనివారణ, మొక్కల పెంపకం, సోలార్ విభాగంలో గ్రామానికి అవార్డు రావడం గర్వంగా ఉంది. మంత్రి హరీశ్‌రావు చొరవతో గ్రామానికి జాతీయ స్థాయిలో పేరు వచ్చింది.

– కుంబాల లక్ష్మి, జెడ్పీటీసీ, ఇబ్రహీంపూర్

వసతుల కల్పన నాది.. చదివే పనిమీది

మంత్రి హరీశ్‌రావు



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటఎడ్యుకేషన్: ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుచూపుతో సిద్దిపేటకు పీజీ కళాశాల వచ్చిందని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో నూతనంగా నిర్మించిన పీజీ కళాశాల, బాలుర, బాలికల హాస్టల్ భవనాలను బుధవారం ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, యూనివర్సిటీ వీసీ రవీందర్‌యాదవ్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకోవాలని, అవసరమైన సౌకర్యాలను కల్పిస్తానన్నారు. చదివేపని మీది, సౌకర్యాల కల్పన తనదన్నారు. ఉపాధి కల్పించే ఇంగ్లిష్, జర్నలిజం, ఎకనామిక్స్, కెమిస్ట్రీ కోర్సులను ప్రవేశపెట్టినట్లు చెప్పారు. జర్నలిజం విద్యార్థులకు మీడియా స్టూడియో, లాబొరేటరీ, స్కిల్‌ల్యాబ్‌లను మూడు నెలల్లో అందుబాటులోకి తెస్తామన్నారు. రానున్న విద్యాసంవత్సరంలో ఎల్‌ఎల్‌బీ, బీఫార్మసీ కళాశాలలను ప్రారంభిస్తామన్నారు. హాస్టల్ విద్యార్థుల భద్రత కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సీపీ శ్వేతకు సూచించారు. వీసీ రవీందర్‌యాదవ్ మాట్లాడుతూ సిద్దిపేట డిగ్రీ కళాశాలను రీసెర్చ్ సెంటర్‌గా గుర్తింపు ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ చైర్ పర్సన్ మంజులరాజనర్సు, రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ సభ్యుడు పాల సాయిరామ్, కౌన్సిలర్ శ్రీదేవి బుచ్చిరెడ్డి, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ హుస్సేన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కూలిన కల్వర్టు

త్రుటిలో తప్పిన ప్రమాదం



జగదేవ్‌పూర్(గజ్వేల్): శిథిలమైన కల్వర్టు కూలిపోయింది. ఈ ఘటన మండలంలోని మునిగడప గ్రామంలో బుధవారం జరిగింది. పెద్ద వరద కాల్వపై మూడు దశాబ్దాల క్రితం కల్వర్టును నిర్మించారు. వరద కాల్వ ద్వారా మందాపూర్ గ్రామ శివారు నుంచి మునిగడప పెద్ద చెరువులోకి వర్షపు నీరు చేరుతుంది. కల్వర్టు పక్కన మట్టి కొట్టుకపోయి గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారింది. స్థానిక ప్రజా ప్రతినిధులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకుపోయినా ఫలితం లేకుండా పోయింది. బుధవారం ఉదయం జగదేవ్‌పూర్‌కు చెందిన ప్రైవేట్ స్కూల్ బస్సు కల్వర్టు మీదుగా వెళ్లిన కొద్దిసేపటికే కూలింది. దీంతో పెను ప్రమాదం తప్పింది. సర్పంచ్ బాలక్ష్మీఐలయ్య సంఘటన స్థలాన్ని పరిశీలించి కూలిన చోట మట్టి పోయించి ప్రమాదకర రోడ్డు అని హెచ్చరిక బోర్డు పెట్టించారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి కల్వర్టు నిర్మాణం చేపడుతామన్నారు.

రాష్ట్రంలో ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి

ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరసింహనాయక్


ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న నరసింహనాయక్

తూప్రాన్: తెలంగాణలో ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని తూప్రాన్ మండలం నర్సంపల్లికి చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరసింహనాయక్ అన్నారు. బుధవారం బీసీ కులగణన, చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని, కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద జాతీయ బీసీ సంక్షేమ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ నాయకత్వంలో బీసీ జనగణన దీక్ష నిర్వహించడం జరిగిందన్నారు. ఈ దీక్షకు సంపూర్ణ మద్దతు తెలిపినట్లు చెప్పారు. బీసీల కులగణన నిర్వహించాలని, అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలో ట్రైబల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రాజ్యసభ సభ్యులు కనకమెడల రవీంద్ర కుమార్, ఎంపీ ఉత్తంకుమార్ రెడ్డి, దేశంలోని వివిధ రాష్ట్రాల బీసీ సంఘాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారని తెలిపారు.

మెదక్‌లో పట్ట పగలు చోరీ


ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

మెదక్ మున్సిపాలిటీ: తాళం వేసిన ఇళ్లనే టార్గెట్ చేసుకొని పట్టపగలే దొంగలు చోరీలకు తెగబడ్డారు. బుధవారం మధ్యాహ్నం ఇళ్ల తాళాలు పగులగొట్టి బంగారం, నగదు అపహరించుకు పోయారు. పట్టణ ఎస్‌ఐ రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్ పట్టణంలోని బృందావన్ కాలనీలోని గడ్డంవారి నగేశ్ ఇంటి తాళం పగులగొట్టిన దొంగ 18 తులాల బంగారం, రూ.70 వేల నగదు, 15 తులాల వెండి ఎత్తుకెళ్లారు. ఇంటి వారు దొంగను పట్టుకునేందుకు ప్రయత్నించగా పారిపోయాడు. అయితే ఇదే కాలనీలో గతంలో చోరీకి గురైన బైక్‌ను దొంగ ఇక్కడ వదిలేసి పారిపోయాడు. అలాగే పట్టణంలోని దాయర వీధికి చెందిన స్వరూప ఇంటి తాళం పగులగొట్టిన దొంగలు బీరువా లాకర్ తెరిచి బంగారం, నగదు, బట్టలు బయట పడేశారు. మూడు తులాలున్న రెండు నెక్లెస్‌లు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు దర్యాప్తు చేపట్టారు.

వేర్వేరు చోట్ల బైక్ చోరీలకు యత్నం

తూప్రాన్: వేర్వేరుచోట్ల గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌ల దొంగతనాలకు యత్నించారు. ఈ సంఘటన మున్సిపల్ కేంద్రంలో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని సాయినగర్ కాలనీలో బుధవారం తెల్లవారుజామున ఇంటి ముందు పార్కు చేసిన బైక్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. బైక్ కనిపించకపోవడంతో యాజమాని చుట్టు పక్కల వెతికేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో మున్సిపల్ కార్యాలయం వెనుక ఏబీ కాలనీలో బైక్‌ను ఇద్దరు వ్యక్తులు తీసుకెళ్లడం గమనించి వారిని పట్టుకునే ప్రయత్నం చేశాడు. దీంతో వారు బైక్‌ను వదిలి పారిపోయారు. అలాగే బీడీ కార్మికుల కాలనీలో మధాహ్నం బైక్‌ను చోరి చేసేందుకు యత్నిస్తున్న దొంగను స్థానికులు పట్టుకొని దేహశుద్ధిచేసి వదిలేశారు. కాగా ఇంటి ముందు పార్క్ చేసిన బైక్‌లను అపహరిస్తున్నారు. పోలీసులు రాత్రి వేళ గస్తీ ముమ్మరంగా చేపట్టాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

బెజ్జంకి(సిద్దిపేట): గుర్తు తెలియని వ్యక్తులు మోటార్ సైకిల్‌ను చోరీ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని లక్ష్మీపూర్ గ్రామస్తుడు రెడ్డి రామకృష్ణారెడ్డి మంగళవారం కీర దోసకాయలు విక్రయించి ఇంటి ముందు టీఎస్ 36 2041 నంబర్‌గల టీవీఎస్ మోటార్ సైకిల్ పార్క్ చేశాడు. బుధవారం ఉదయం లేచి చూసేసరికి వాహనం కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా కనిపించకపోవడంతో బాధితుడు పోలీస్ స్టేషనలో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు హెడ్ కానిస్టేబుల్ యూనస్ తెలిపారు.

మృతదేహాల వెలికితీత

- బావిలో మోటారు ఏర్పాటు చేసేందుకు వెళ్లిన యువకులు
- ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి


రోదిస్తున్న కుటుంబ సభ్యులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని ఇబ్రహీంపూర్‌లో బావిలోపడి మృతి చెందిన యువకుల మృతదేహాలను పోలీసులు స్థానికుల సాయంతో బయటకు తీశారు. మంగళవారం రాత్రి బావిలో మోటారు ఏర్పాటు చేసేందుకు వెళ్లిన మైసమ్మగారి స్వామి(25), బాయికాడి ప్రవీణ్ వరుసకు అన్నదమ్ములు. వీరిద్దరితోపాటు మరో ఇద్దరు బావిలో మోటారు ఏర్పాటు చేసేందుకు వెళ్లారు. ప్రమాదవశాత్తు స్వామి, ప్రవీణ్ బావిలోపడి మునిగిపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు అదే రాత్రి గ్రామానికి చేరుకొన్నారు. మృతదేహాలను బుధవారం తెల్లవారు జామున బయటకు తీశారు. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు యువకుల మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. రాజవ్వ, వెంకటి దంపతులకు స్వామి ఒక్కడే కుమారుడు కావడంతో తల్లిదండ్రుల రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి. మృతుల కుటుంబాలను ఎమ్మెల్యే రఘునందన్‌రావు పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపారు.

హత్యకేసులో ముగ్గురి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ

ఝరాసంగం(జహీరాబాద్): భూ తగాదాల నేపథ్యంలో బర్దీపూర్ గ్రామ శివారులో జరిగిన హత్య కేసులో ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నోముల వెంకటేశం తెలిపారు. బుధవారం ఝరాసంగం పోలీసుస్టేషన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. మండల పరిధిలోని బర్దీపూర్ గ్రామానికి చెందిన బండమీది చంద్రన్న(60)ను ఈ నెల 28వ తేదీన బర్దీపూర్ శివారులో తన తమ్ముడి కుమారుడు రాకేశ్ హత్య చేశాడు. కత్తితో తల, మొండెం వేరు చేశాడు. 15 ఏళ్లుగా భూ తగాదాలు కొనసాగుతున్నాయి. మృతుడికి పొట్టిపల్లి గ్రామ శివారులో నాలుగు ఎకరాలు, బర్దీపూర్ శివారులో 8 ఎకరాలు ఉంది. బర్దీపూర్ శివారులోని భూమిలో తమకు వాటా వస్తుందని, కొన్నేళ్లుగా అన్నదమ్ములు గొడవ పడుతున్నారు. మృతుడి పొలాన్ని దున్నితే తమకు రావాల్సిన వాటా వస్తుందని భావించి పొట్టిపల్లి శివారులోని పొలాన్ని దున్నాడు. మృతుడు జహీరాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఇటీవలే ఫిర్యాదు చేయగా, వారిని పిలిచి ఇబ్బందులు సృష్టించవద్దని పోలీసులు హెచ్చరించారు. మంగళవారం మధ్యాహ్నం బర్దీపూర్ శివారులో పొలం పనులు ముగించుకుని ఇంటికి వస్తున్న క్రమంలో రాకేష్ కత్తితో చంద్రన్నను దారుణంగా హత్య చేశాడు. రాకేశ్‌తో పాటు తండ్రి బండమీది రత్నం, స్నేహితుడు కలంల కన్న అలియాస్ స్వరాజ్‌ను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ద్విచక్రం నడిపే వాహనదారుడు హెల్మెట్, ఇతర వాహనాలు నడిపే వారు సీట్ బెల్ట్‌లను తప్పనిసరిగా ధరించాలని ట్రాఫిక్ సీఐ రామకృష్ణ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ట్రాఫిక్, మోటార్ వాహనాల చట్టాలు, రోడ్ సేఫ్టీ, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలు నివారించవచ్చన్నారు. మైనర్లు వాహనాలు నడపరాదని, మైనర్లు వాహనాలు నడపడం ద్వారా ప్రమాదాలు సంభవిస్తాయన్నారు. అందువలన మైనర్లు ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు నడపవద్దని, మైనర్ల డ్రైవింగ్ చాలా ప్రమాదకరమని తెలిపారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా చూడాలన్నారు. మానవ తప్పిదం, అధిక వేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వలన రోడ్ యాక్సిడెంట్లు జరుగుతున్నాయన్నారు. ట్రాఫిక్ నియమ నిబంధనలు విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవడం వల్ల రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చన్నారు. అదే విధంగా విద్యార్థులు రోడ్డుపై జరిగే ప్రమాదాలను తల్లి దండ్రులకు, చుట్టుపక్కల వారికి తెలియచేసి వాలో చైతన్యం కలుగచేయాలన్నారు. ప్రతీ వ్యక్తి రోడ్డు పై ప్రయాణం చేసేటప్పుడు తప్పకుండా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలన్నారు. అదే విదంగా రహదారి నియమ నిబంధనలు పాటించాలన్నారు.

దొంగల భయం.. రాత్రంతా జాగారం

- నిద్రలేకుండా గడిపిన గ్రామస్తులు
- కర్రలు పట్టుకుని యువకుల గస్తీ


గస్తీ తిరుగుతున్న గ్రామ యువకులు

రామాయంపేట(మెదక్): ముసుగు దొంగలు గ్రామంలోకి ప్రవేశించారని తెలుసుకున్న గ్రామస్తులు హడలిపోయి మంగళవారం రాత్రంతా కంటిమీద కునుకులేకుండా గడిపారు. యువకులు కర్రలు చేతపట్టుకొని గ్రామంలో గస్తీ కాశారు. వివరాలు ఇలా ఉన్నాయి. నార్సింగి మండలం శేరిపల్లి గ్రామంలో ముగ్గురు ముసుగు దొంగలు సంచరిస్తున్నారని కొందరు వ్యక్తులు గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. దీనితో ఉలిక్కిపడ్డ గ్రామస్తులు సెల్‌ఫోన్ల ద్వారా వాకబు చేసుకుంటూ అందరికీ సమాచారం అందజేశారు. నిమిషాల వ్యవధిలో ఈవార్త గ్రామంలో దావానలంలా వ్యాపించింది. యువకులు కర్రలు చేతపట్టుకొని గ్రామంలో గస్తీ కాయడంతోపాటు దొంగల కోసం గాలించారు. చాలామంది తమ కుటుంబ సభ్యులతో నిద్రలేకుండా తమ ఇళ్ల ముందే కాపుకాశారు. కరెంటు సరఫరా లేని సమయంలో మాస్కులు ధరించిన ముగ్గురు గ్రామంలో సంచరిస్తుండగా చూశామని కొందరు యువకులు తెలిపారు. విషయం తెలుసుకొని నార్సింగి పోలీసులు గ్రామానికివెళ్లి యువకులతో కలిసి తిరిగినా అనుమానితులెవరూ కనిపించలేదు. ఇకపై ప్రతీరోజు రాత్రివేళలో గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహించాలని గ్రామస్తులు విజ్ఞప్తిచేశారు. గ్రామస్తులు భయాందోళన చెందవద్దని, తాము ఎల్లవేళలా అండగా ఉంటామని పోలీసులు వారికి ధైర్యం చెప్పారు.

సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి


గజ్వేల్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న సైబర్ అంబాసిడర్లు

గజ్వేల్‌రూరల్: సైబర్ నేరగాళ్ల బురిడీ మాటలతో ప్రజలు మోసపోకుండా వారికి సైబర్ నేరాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత సైబర్ అంబాసిడర్లపై ఉందని గజ్వేల్ షీటీమ్ ఇన్‌చార్జి ఏఎస్‌ఐ అమృత్ అన్నారు. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, గజ్వేల్ పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లోగల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్‌లో 8, 9వ తరగతి విద్యార్థులకు బుధవారం సైబర్ నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 2023 జనవరి 11వ తేదీన జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉమెన్ సేఫ్టీ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉమెన్ సేఫ్టీవింగ్ తెలంగాణ పోలీస్, విద్యాశాఖ సంయుక్తంగా ప్రతీ పాఠశాలలో సైబర్ అంబాసిడర్లను, సైబర్ అంబాసిడర్ ప్లాట్‌ఫామ్(సీఏపీ) కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ప్రతీ పాఠశాలలో 8, 9వ తరగతి విద్యార్థుల్లో నలుగురిని సైబర్ అంబాసిడర్లగా ఎంపిక చేసి వారికి పలు అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని 50 పాఠశాలల నుంచి 200 మంది సైబర్ అంబాసిడర్లుగా తయారు చేసేందుకు విద్యార్థులను ఎంపిక చేశామన్నారు. వారిని పర్యవేక్షించేందుకు ఒక ఉపాధ్యాయుడిని నియమించి ఆన్‌లైన్ ద్వారా ఐదు స్టేషన్లలో సైబర్ నేరాల గురించి పూర్తి అవగాహన కల్పించడం జరిగిందన్నారు. సైబర్ అంబాసిడర్లు తోటి విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించడంతో పాటు నేరాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామంటూ వారిచే ప్రతిజ్ఞ చేయించారు.

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఉమెన్ సేఫ్టీవింగ్ తెలంగాణ పోలీస్, ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ సంయుక్తంగా జిల్లాలోని ప్రతీ పాఠశాల నుంచి సైబర్ అంబాసిడర్లగా విద్యార్థులను ఎంపిక చేసింది. సిద్దిపేట మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దుర్గ, డివిజన్ షీటీం ఇన్‌చార్జి ఏఎస్‌ఐ ముజీబ్ హైమద్ బుధవారం ఇంద్రానగర్ జిల్లా పరిషత్ హైస్కూల్, రంగధాంపల్లిలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సైబర్ అంబాసిడర్లగా ఎంపిక చేసినవారితో ప్రతిజ్ఞ చేయించారు.

సైబర్ అంబాసిడర్లుగా పాఠశాల విద్యార్థులు

హుస్నాబాద్: ఉమెన్ సేఫ్టీ తెలంగాణ పోలీస్, ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ సంయుక్తంగా హుస్నాబాద్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం సైబర్ అంబాసిడర్ల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ షీటీమ్ ఇన్‌చార్జి మల్లేశం మాట్లాడుతూ ఒక్కొక్క స్కూల్ నుంచి 8, 9 తరగతులు చదివే విద్యార్థినులు నలుగురిని సైబర్ అంబాసిడర్లుగా ఎంపిక చేశారన్నారు.

మెదక్ మున్సిపాలిటీ: సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించి చైతన్య పరచడమే ప్రధాన లక్ష్యమని జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని అన్నారు. బుధవారం మెదక్‌లోని జిల్లా పోలీసు కార్యాలయంలో గత నెలరోజులుగా జిల్లాలో షీటీమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలను స్కూళ్లు, కాలేజీలల్లో నిర్వహిస్తున్నాయన్నారు. కొంత మంది చురుకైన విద్యార్థులను ఎంపిక చేసి వారిని సైబర్ అంబాసిడర్లుగా నియమించి వారి ద్వారా సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి


కేతావత్ గణేశ్ (ఫైల్)

నారాయణఖేడ్: ఎదురెదురుగా ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందగా, మరో ముగ్గురు గాయపడ్డారు. ఈ సంఘటన నారాయణఖేడ్ పట్టణ శివారులోని ఆర్టీసీ డిపో సమీపంలో మంగళవారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఖేడ్ మండలం నమ్లిమేట్ గుండు తండాకు చెందిన కేతావత్ గణేశ్ (27), అతడి మామ శంకర్ ద్విచక్రవాహనంపై ఖేడ్‌కు వచ్చి రాత్రి తిరుగు ప్రయాణమయ్యారు. ఇదే క్రమంలో ఖేడ్ జంట గ్రామం మంగల్‌పేటకు చెందిన జ్ఞానేశ్వర్ మరొకరితో కలిసి బైక్‌పై నిజాంపేట నుంచి ఖేడ్ వైపునకు వస్తున్నారు. ఆర్టీసీ డిపో సమీపంలో రెండు వాహనాలు ఢీకొనడంతో నలుగురూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని ఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించగా అప్పటికే గణేశ్ మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.


వెంకటేశం (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): ఎదురెదురుగా ట్రాలీ ఆటో, బైక్ ఢీ కొనడంతో ఓ వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మిరుదొడ్డి మండలం పెద్ద చెప్యాల ఎక్స్‌రోడ్డు వద్ద బుధవారం జరిగింది. మిరుదొడ్డి ఎస్సై శ్రీధర్ గౌడ్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మిరుదొడ్డి మండల కేంద్రానికి చెందిన కొండ వెంకటేశం(47) సెక్యూరిటీ గార్డ్‌గా సిద్దిపేట లో పనిచేస్తున్నాడు. బుధవారం విధులు ముగించుకుని తన బైక్‌పై సిద్దిపేట నుంచి మిరుదొడ్డికి వస్తున్నాడు. పెద్దచెప్యాల మూల మలుపు వద్ద ఎదురుగా వస్తున్న ట్రాలీ ఆటో ఢీ కొట్టడంతో బైక్‌పై నుంచి ఎగిరి రోడ్డుపై పడటంతో అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.


భరత్ (ఫైల్)

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రగాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో బుధవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కోహిర మండలం మనియార్ పల్లి గ్రామానికి చెందిన భరత్(26) తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని అంబేడ్కర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 25వ తేదీ మధ్యాహ్నం బైక్‌పై తెల్లాపూర్ నుంచి ఇంటికి వస్తున్నాడు. బైక్ అదుపు తప్పి కిందపడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు.


అశోక్ (ఫైల్)

కౌడిపల్లి(నర్సాపూర్): ఎదురెదురుగా లారీ, బైక్ ఢీకొనడంతో యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన కౌడిపల్లి మండలం తునికిగేట్ పెట్రోల్ బంక్ సమీప 765 (డి) జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగింది. ఏఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కౌడిపల్లి మండలం ముట్రాజ్‌పల్లికి చెందిన సుంచు సాయిలుకు ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. చిన్న కొడుకు సుంచు అశోక్(28) ఎలక్ట్రీషన్ వర్క్ చేస్తుంటాడు. నెల క్రితం పెళ్లయ్యింది. బుధవారం కొత్తబైక్ రిజిస్ట్రేషన్ చేయించేందు నర్సాపూర్ వెళ్లాడు. అనంతరం తెలిసిన వారికి ప్రమాదం జరగడంతో వారికి ఆస్పత్రిలో చికిత్స చేయించి తిరిగి ఇంటికి వస్తున్నాడు. తునికిగేట్ పెట్రోల్‌బంక్ సమీపంలో మెదక్ నుంచి నర్సాపూర్ వెళ్తున్న లారీ బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో అశోక్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.